www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 30 ఆగస్టు 2023
5
పశ్చిమ గోదావరి



నేడు, రేపు దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

ఆకివీడు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 కార్డ్ విధానాన్ని తీవ్రంగా నిరసిస్తూ ఈ నెల 30, 31 తేదీల్లో పెన్‌డౌన్ చేపట్టినట్లు దస్తావేజు లేఖరులు తెలిపారు. ఎపి స్టేట్ డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు లేఖరులు ప్రకటించారు. ఈ విధానం వల్ల ఆస్తుల్లో తగాదాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వేలాది మంది లేఖరుల కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని తెలిపారు. దీన్ని నిరసిస్తూ పెన్‌డౌన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉండి: ఈ నెల 30, 31 తేదీల్లో దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌ను విజయవంతం చేయాలని సీనియర్ దస్తావేజు లేఖరులు మునుకోలు సింహాచలం, కొమ్మన రాఘవ సూచించారు. మంగళవారం ఉండిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో బి.రవిబాబు, నందుల నారాయణమూర్తి, బురిడి వీర్రాజు, లోకారపు రాము, పాండురంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పెంచింది కొండంత.. తగ్గించింది గోరంత..!

మోడీ అధికారంలో కొచ్చాక సిలిండర్ ధర రూ.700కుపైగా పెంపు

ప్రస్తుతం వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1136

గ్యాస్ నగదు బదిలీకి తిలోదకాలిచ్చిన బిజెపి సర్కార్

సిలిండర్‌పై రూ.200 తగ్గింపుపై అక్కా చెల్లెమ్మల పెదవివిరుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.200 తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే మోడీ సర్కార్ అధికారంలోకొచ్చాక వంటగ్యాస్ సిలిండర్ పెరిగిన ధరకు, ప్రస్తుతం తగ్గించిన ధరకు అసలు పొంతన లేకుండాపోయింది. దీంతో పెంచింది కొండంత, తగ్గించింది గోరంత అంటూ జనం పెదవి విరుస్తున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎనిమిది లక్షల వరకూ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. హెచ్‌పి, ఇండియన్, భారత్ వంటి గ్యాస్ సిలిండర్లను వినియోగదారులు వినియోగిస్తున్నారు. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి వంటగ్యాస్ 14.2 కిలోల సిలిండర్ ధర రూ.410 మాత్రమే. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.1136గా ఉంది. అంటే రూ.700కుపైగా సిలిండర్ ధర పెరిగింది. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై నగదు బదిలీ పథకాన్ని ప్రవేశపెట్టింది. సబ్సిడీ సొమ్ము వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో వేసేవిధంగా నిబంధనలు తెచ్చింది. మోడీ ప్రభుత్వం వచ్చాక నెలల వారీగా గ్యాస్ సిలిండర్ ధర పెరుగుతూ ప్రస్తుతం రూ.1136కు చేరింది. వంటగ్యాస్‌పై నగదు బదిలీ పథకాన్ని మోడీ సర్కార్ నిలిపివేసింది. దీంతో పూర్తిసొమ్ము చెల్లించి వినియోగదారులు సిలిండర్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లాలో అత్యధిక గ్యాస్ వినియోగదారులు సామాన్య ప్రజానీకమే. ప్రతినెలా గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో రక్షాబంధన్ కానుకగా సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం వినియోగదారులకు ఏదో మేలు చేసినట్లు గొప్పలు చెబుతోంది. పెరిగిన ధరతో పోలిస్తే తగ్గిన ధర అతి స్వల్పమని జనం కుండబద్దలు కొట్టినట్లు చెబుతున్నారు.

భూములూ లేవు.. పరిహారమూ లేదు..!

- వట్లూరు వెమ్‌టెక్నాలజీ బాధిత రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- ఏడేళ్లు దాటినా అందని పరిహారం
- అప్పట్లో పరిశ్రమ పేరుతో రైతుల నుంచి 340 ఎకరాలు స్వాధీనం
- ఎకరాకు రూ.2.50 లక్షలు పరిహారం ఇచ్చేలా ఒప్పందం
- ప్రభుత్వం మారడంతో పరిశ్రమ ఏర్పాటు వెనక్కి
- మా భూములు మాకివ్వాలంటున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వట్లూరులో వెమ్ టెక్నాలజీ (విమాన విడిభాగాల తయారీ) పరిశ్రమ పేరుతో రైతుల నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వం పరిహారమూ ఇవ్వకుండా, భూములు లేకుండా చేసిన వైనమిది. ఏడేళ్లుగా తమకు న్యాయం చేయాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పరిశ్రమ ఏర్పాటుపై ప్రభుత్వం వెనక్కి తగ్గడంతో తమ భూములు తిరిగిచ్చేయాలంటూ రైతుల రోడ్డెక్కుతున్నారు. అటు పరిహారం ఇవ్వకుండా, ఇటు భూములు ఇవ్వకుండా రైతులను ప్రభుత్వం రోడ్డున పడేసింది.

టిడిపి ప్రభుత్వ హయాంలో 2016లో వెమ్‌టెక్నాలజీ పరిశ్రమను వట్లూరులో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి పెదపాడు మండలం వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 495, 496, 497లోనూ, పెదవేగి మండలంలోని సర్వే నెంబర్ 210-29 పరిధిలోని దాదాపు 340 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా కేటాయించారు. దాదాపు 300 మంది సన్న, చిన్నకారు రైతులు ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. రికార్డుల ప్రకారం ఈ భూములు చెరువు భూములుగా ఉన్నాయి. అయితే గడిచిన వందేళ్లుగా ఈ భూములను రైతులు సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూమి అనే పేరుతో రైతులకు ఎటువంటి పరిహారమూ ఇవ్వకుండా భూములు లాగేసుకున్నారు. దీనిపై అప్పట్లో రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతో ప్రభుత్వం దిగొచ్చింది. ఎకరాకు రూ.2.50 లక్షల పరిహారం చెల్లించేలా నిర్ణయించారు. అయితే రైతులకు ఒక్క చిల్లిగవ్వ కూడా ఇప్పటికీ ఇవ్వలేదు. ప్రభుత్వం మారడంతో పరిశ్రమ ఏర్పాటు వెనక్కిపోయింది. దీంతో అగ్రిమెంట్ రద్దు చేసుకుని 2022 ఏప్రిల్‌లో ఈ భూములను వెమ్ టెక్నాలజీ నుంచి ఎపిఐఐసి స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం ఈ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. రైతులు మాత్రం రోడ్డున పడ్డారు. ఎంతోమంది రైతులు ఆ భూములను ఆడపిల్లలకు పసుపు కుంకుమ కింద ఇచ్చి వివాహాలు చేశారు. వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోని దుస్థితి నెలకొంది.



మా భూములు మాకిచ్చేయండి : రైతులు

వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటు పేరుతో సన్న, చిన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న వందల ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీంతో పరిశ్రమ ఏర్పాటు లేదని తేలిపోయింది. ప్రస్తుతం భూములన్నీ బీడుగా ఖాళీగా ఉన్నాయి. పరిశ్రమ ఏర్పాటు చేయడం లేదని, పరిహారం ఇవ్వకపోవడంతో తమ భూములు తమకిచ్చేయాలని బాధిత రైతులు పోరుబాట పట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం వట్లూరులోని వెమ్ టెక్నాలజీ బాధిత రైతులకు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

భూమిలేక ఆదాయం కోల్పోయాం..

పిడిగే జోసఫ్, వట్లూరు, బాధిత రైతు

మా కుటుంబం మొత్తం ఐదెకరాల భూమిని కోల్పోయాం. దీంతో ఏడేళ్లుగా చిల్లిగవ్వ ఆదాయం లేని పరిస్థితి నెలకొంది. 2016లో భూములు తీసుకున్నప్పుడు ఎకరాకు రూ.2.50 లక్షలు పరిహారం ఇస్తామన్నారు. ఇప్పటి వరకూ రూపాయి ఇవ్వలేదు. పరిహారం ఇవ్వకుండా, పరిశ్రమ ఏర్పాటు చేయకుండా భూములను బీడుగా పెట్టారు. మా భూములు మాకిచ్చేస్తే సాగు చేసుకుంటాం. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నాం.

మా భూములు మాకివ్వాలి

వల్లముల రామాంజనేయులు, వట్లూరు

మా కుటుంబానికి సంబంధించి నాలుగెకరాల భూమి కోల్పోయాం. మా పిల్లలకు పసుపు కుంకుమ కింద ఇవే భూములిచ్చాం. ప్రభుత్వం చిల్లిగవ్వ పరిహారం ఇవ్వలేదు. పరిశ్రమ నిర్మాణం ఆగిపోయింది. మా భూములు మాకిచ్చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. రోడ్డున పడ్డ రైతులకు న్యాయం చేయాలి.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

వట్లూరులో వెమ్ టెక్నాలజీ పరిశ్రమ ఏర్పాటు పేరుతో రైతుల నుంచి భూములు తీసుకుని ఏడేళ్లు దాటిపోయింది. ఇప్పటి వరకూ పరిహారం ఇవ్వలేదు. రైతులకు భూములు వెనక్కివ్వాలి. ప్రభుత్వ అవసరాలకు తీసుకుంటే పరిహారం చెల్లించాలి. ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసు కేసులు పెట్టడం సమంజసం కాదు. రైతులకు న్యాయం చేయకపోతే రైతుసంఘం బాధిత రైతులకు అండగా నిలబడి పోరాడుతుంది.

ధరల అదుపులో కేంద్రం విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు



వేంద్రలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ధరలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ విమర్శించారు. వేంద్రలో సిపిఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమరభేరి కార్యక్రమాల్లో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ నిరుద్యోగం, విద్యుత్ ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను అరికట్టకుండా ప్రజలపై మరింత భారాన్ని మోపడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి చేపట్టమన్నారు. సెప్టెంబర్ 1న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద వినతిపత్రాల సమర్పణ, విజ్ఞాపన పత్రాలు, 3న నిరుద్యోగ వ్యతిరేక దినంగా తహశీల్దార్ కార్యాలయం వద్ద సదస్సులు సమావేశాలు నిర్వహణ, సెప్టెంబర్ 4న ధర్నాలు నిర్వహించనున్నామన్నారు. ఈ సమరభేరి కార్యక్రమానికి ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆశ్రయ, టి.రామారావు, వైఎస్ఎన్.మూర్తి, కె.అప్పారావు, పూసల లక్ష్మం స్వామి, ఆర్.తాతారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉండి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దొందూ దొందే అని, ప్రజలపై పన్నుల భారాలు వేయడంలో ఒకదాన్ని మించి మరొకటి పోటీ పడుతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ విమర్శించారు. ఉండి మెయిన్ సెంటర్లో మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెంచిన ధరలకు వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ధరలూ విపరీతంగా పెంచి ప్రజలపై పెను భారాలు మోపాయన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టాడ వెంకటేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, కడలి నాగేశ్వరరావు,వి.సూర్యనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు ధ్యాన్‌చంద్, గిడుగు : కలెక్టర్

భీమవరం: ధ్యాన్‌చంద్, గిడుగు వెంకటరామ్మూర్తి పంతులును అంతా ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఈ ఇరువురు నిరంతర కృషి, పట్టుదల, శ్రమ ఫలితాల ద్వారా సాధించిన విజయాల నుండి స్ఫూర్తిని పొందాలన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో ధ్యాన్‌చంద్, గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టర్ ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామ్మూర్తి అని, ఆయన జన్మదినమైన ఆగస్టు 29ని తెలుగు భాషా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఇదే రోజున జన్మించిన సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్ పేరిట జాతీయ క్రీడా దినోత్సవం ప్రతియేటా జరుపుకోవడం జరుగుతుందన్నారు. గిడుగు తెలుగు వ్యవహారిక భాషకు పితామహుడని తెలిపారు. గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంత్యుత్సవాలను పురస్కరించుకుని జిల్లాలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఐదుగురు తెలుగు భాషా పండితులకు మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిఇఒ వెంకటరమణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ బి.జాన్సన్, పిఇటి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ

మోసకారి హామీలతో నిండా ముంచిన జగన్

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధం

యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, టి.నరసాపురం, చింతలపూడి

టిడిపి అధికారంలోకొచ్చాక పోలవరం నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజి ఇచ్చే వెసులుబాటు ఉంటే కచ్చితంగా అందిస్తామని, గతంలో ఇచ్చిన ప్యాకేజీ హామీకి మాత్రం కట్టుబడి ఉన్నామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. 198వ రోజు యువగళం పాదయాత్ర మంగళవారం చింతలపూడి మండలం తీగలవంచలో ప్రారంభమై పోలవరం నియోజకవర్గంలో ప్రవేశించింది. పోలవరం నియోజకవర్గం ముత్యాలమ్మపేటలో ప్రవేశించిన లోకేష్ పాదయాత్రకు నాయకులు, కార్యర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. దారిపొడవునా జనం పెద్దఎత్తున తరలొచ్చారు. జనంతో మమేకమవుతూ లోకేష్ ముందుకు సాగారు. తీగలవంచ, టి.నరసాపురం, ఏపుగుంట, తిరుమలదేవిపేట, వెంకటాపురం గ్రామాలకు చెందిన ప్రజలు లోకేష్‌ను కలిసి తమ గ్రామాల్లోని సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ప్రజలు అందించిన వినతుల్లోని సమస్యల పరిష్కారానికి అధికారంలోకి వచ్చిన వెంటనే కృషి చేస్తామని లోకేష్ వారికి హామీ ఇచ్చారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో శ్రీరామవరంలో పోలవరం నిర్వాసితులతో నిర్వహించిన ముఖాముఖిలో లోకేష్ మాట్లాడారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని పోలవరం నిర్వాసితులు మాట్లాడుతూ జగన్ రూ.పది లక్షల ప్యాకేజీ ఇస్తామని చెప్పి మోసగించారన్నారు. నిర్వాసితులను ముంచి ఆయన హ్యాపీగా పడుకున్నాడని, వరదలు వచ్చినప్పుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వాపోయారు. నిర్వాసితులు బతకడానికి ఇతర ప్రాంతాలకు వెళితే స్థానికులు కాదంటున్నారన్నారు. రీసర్వే పేరుతో తామంతా తీవ్రంగా నష్టపోతున్నామని, 2017లో ఒకసారి సర్వే అయినా మరోసారి సర్వే అంటూ జగన్ ప్రభుత్వం వేధిస్తుందని తెలిపారు. ఊర్లు ఖాళీ చేయించి ప్రభుత్వం మాకు ఎటువంటి సాయమూ అందించలేదని తెలిపారు. 2017 కట్ ఆఫ్ డేట్ పెట్టి 18 ఏళ్లు ఉన్నవారికి ప్యాకేజీకి అర్హులుగా టిడిపి ప్రభుత్వం ప్రకటించగా జగన్ వచ్చిన తరువాత ప్యాకేజీ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. వైఎస్ హయాంలో భూములిచ్చిన వారికి అదనంగా రూ.ఐదు లక్షలు ఇస్తానని జగన్ మోసగించారని తెలిపారు.



పాదయాత్రలో లోకేష్ అభివాదం

పోలవరం కట్టేది.. నిర్వాసితులకు న్యాయం చేసేది టిడిపినే

నిర్వాసితులతో లోకేష్ మాట్లాడుతూ పోలవరం పూర్తి చేసేది, నిర్వాసితులకు న్యాయం చేసేది టిడిపి ప్రభుత్వమేనని అన్నారు. చంద్రబాబు హయాంలో 72 శాతం పోలవరం పనులు పూర్తయ్యాయన్నారు. రూ.లక్షా 15 వేల ప్యాకేజీని రూ.6.36 లక్షలకు పెంచింది చంద్రబాబేనన్నారు. రూ.నాలుగు వేల కోట్లు నిర్వాసితులకు ప్యాకేజీ, పునరావాసం కోసం ఖర్చు చేసింది టిడిపినే అన్నారు. పాలిచ్చే ఆవుని వద్దనుకుని తన్నే దున్నపోతుని తెచ్చుకున్నారన్నారు. రూ.పది లక్షలు ప్యాకేజీ అని, గతంలో సేకరించిన భూములకు అదనంగా రూ.ఐదు లక్షలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు తన చేతుల్లో ఏమీ లేదు.. కేంద్రం బటన్ నొక్కితేనే నిర్వాసితులకు డబ్బులు అని జగన్ అంటున్నాడని విమర్శించారు. జగన్ ఒక్క ఇల్లూ కట్టలేదు.. ఒక్కరికీ పూర్తిగా ప్యాకేజీ అమలు చేయలేదని అన్నారు. జగన్ ఇప్పుడు ఎన్నికలకు వెళ్తే 25 సీట్లు వస్తాయని, మరో ఆరు నెలలు పోతే సింగిల్ డిజిట్‌నే అని, అందుకే జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లబోతున్నాడని సమాచారం ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిడిపి సిద్ధంగా ఉందని తెలిపారు. దొంగ కాగితాలు సృష్టించి నిర్వాసితులకు రావాల్సిన వందల కోట్లు వైసిపి నేతలు కొట్టేశారన్నారు. 2017లో జరిగిన సర్వేకు టిడిపి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దాని ఆధారంగానే ప్యాకేజీ అందిస్తామని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో యువతకు ఉద్యోగాలు కల్పించేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగిన ఆధిపత్య పోరు..

పోలవరం నియోజకవర్గంలో లోకేష్ పర్యటన సందర్భంగా టిడిపిలో ఆధిపత్య పోరు మరోసారి బయటపడింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ మొడియం శ్రీనివాస్ మధ్య ఆధిపత్య పోరు నెలకొన్న సంగతి తెలిసిందే. ఫ్లెక్సీల ఏర్పాటులో బొరగం శ్రీనివాస్ ఫొటో చిన్నదిగా పెట్టడం వంటి విషయాలపై ఇరుగ్రూపుల్లో పోటీ నెలకొంది. ఆ కారణంగానే పోలవరం నియోజకవర్గంలో సాగిన యాత్రలో మిగిలిన చోట్ల కంటే జనాదరణ తగ్గిందనే చర్చ నడిచింది.

భీమవరం అభివృద్ధికి కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

నియోజకవర్గంలో మరింత అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఇంకా అవసరమైన పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదలు పంపుతామన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో భీమవరం నియోజవర్గ సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. స్థానిక ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమీక్షించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి, ఇంకా పూర్తి కావాల్సిన ఇళ్లు ఎన్ని పరిశీలించాలన్నారు. ఇంకా లబ్ధిదారులు ఉన్నారా ఉంటే వారికి భూసేకరణ ఏ మేరకు చేయాలో అంచనాలు రూపొందించాలన్నారు. ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న కాలనీల నిర్మాణం పూర్తయితే కొత్త ఊర్లు తయారవుతాయన్నారు. కార్యక్రమంలో జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఆర్‌డిఒ దాసి రాజు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, సిపిఒ కె.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: అభివృద్ధి, సంక్షేమా కార్యక్రమాల అమలును సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేయడానికే నియోజకవర్గ సమీక్ష నిర్వహించామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎంఎల్ఎ, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలసి నరసాపురం నియోజకవర్గ సమీక్ష కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఇంటి స్థలాలు మంజూరు చేసిన లబ్ధిదారులకు పొజిషన్ చూపాలన్నారు. పలు గ్రామాల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ కె.కృష్ణవేణి, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, సిపిఒ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ పాల్గొన్నారు.

సమరభేరిలో ప్రజలు భాగస్వాములు కావాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సిపిఎం చేపట్టిన సమరభేరిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ జరిగే దశలవారీ ఆందోళనకు ప్రజానీకం తరలిరావాలన్నారు. స్థానిక మెంటేవారితోట సుందరయ్య భవనంలో సిపిఎం జనరల్ బాడీ పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొమ్మిదేళ్ల కాలంలో ప్రజలపై అనేక రూపాల్లో భారాలు వేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని మరిచి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం తాము అధికారంలోకి రాగానే వంద రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రభుత్వరంగాన్ని కాపాడుతామని, గ్యాస్ ధరలు తగ్గిస్తామని వాగ్దానం చేసి అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి మోడీ చేతిలో కీలుబొమ్మగా మారాడని, మోడీ చెప్పిన దాన్ని తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒకవైపు గ్యాస్, పెట్రోలు, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ ఉంటే మళ్లీ విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారని విమర్శించారు. ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని గొప్పగా చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వం ఆ సంక్షేమ పథకాల్లో అనేక కోతలు పెట్టి అర్హులకూ అందకుండా చేస్తోందని విమర్శించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడగా నేతలు వడుగు వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, ఆర్.రమేష్, మావుళ్ళు, డి.నాగు, వరలక్ష్మి, అప్పన్న, రేణుక, ఎం.మంగతాయారు, కె.కుమారి, జె.శ్రీనివాస్, సాయమ్మ పాల్గొన్నారు.

చంద్రయాన్-3తో విలువైన సమాచారం

ఇస్రో పూర్వపు శాస్త్రవేత్త, ఐఐఎస్‌టి రిజిస్ట్రార్ డాక్టర్ వైవిఎన్.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - భీమవరం రూరల్



ఇస్రో పూర్వపు శాస్త్రవేత్త కృష్ణమూర్తికి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపల్ జగపతిరాజు

మన శాస్త్రవేత్తలు ప్రయోగించిన చంద్రయాన్-3తో ప్రపంచంలో ఇంతవరకు ఎవరూ సేకరించని విలువైన సమాచారం మనకు అందుబాటులోకి వస్తుందని ఇస్రో పూర్వపు శాస్త్రవేత్త, తిరువనంతపురంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ సీనియర్ ప్రొఫెసర్, రిజిస్ట్రార్ డాక్టర్ వైవిఎన్.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులతోనూ ఆయన మాట్లాడారు. చంద్రయాన్-3 హైడ్రాక్స్ మలిక్యుల్స్ వంటి ఎంతో విలువైన సమాచారాన్ని అందించిందన్నారు. ఇటువంటి సమాచారం ఇంతవరకు ప్రపంచంలో ఏ దేశమూ సేకరించలేదన్నారు. చంద్రయాన్-2 కూడా 25 సెంటీమీటర్ల రిజల్యూషన్‌లో మూన్‌ను మ్యాప్ చేసి పంపిస్తుందని చెప్పారు. ప్రధానంగా ఉష్ణోగ్రతల వ్యత్యాసం వంటి సమాచారం చక్కగా అందిస్తున్నాయన్నారు. కళాశాల స్థాయిలో కూడా స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేసి అధ్యాపకులు, విద్యార్థులు శాటిలైట్స్ తయారు చేసేలా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఎస్ఆర్‌కెఆర్ కళాశాల విద్యార్థులచే మినీ శాటిలైట్స్ రూపొందించేలా ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా వచ్చినట్లు చెప్పారు. మానవులు ఎదుర్కొంటున్న కేన్సర్ వంటి అనేక రుగ్మతలను గుర్తించటం, పర్యావరణ కాలుష్యం ఏ మేరకు పెరుగుతుంది తదితర అంశాలు అధ్యయనం చేసేందుకు విద్యార్థులు మినీ శాటిలైట్స్ రూపొందించవచ్చునన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాకరమైన ఇస్రో శాస్త్రవేత్తగా పని చేసిన వైవిఆర్.కృష్ణమూర్తి తమ కళాశాలకు వచ్చి విద్యార్థులకు సూచనలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఆర్అండ్‌డి డీన్ డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు, వివిధ విభాగాల హెడ్స్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

'ప్రజాశక్తి' మరింత పురోగమించాలి

43వ వార్షికోత్సవ సంచిక ఆవిష్కరణలో ఏలూరు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు: ప్రజాశక్తి దినపత్రిక మరిన్ని వార్షికోత్సవాలు జరుపుకోవాలని, భవిష్యత్తులో మరింతగా పురోగమిస్తూ ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకాంక్షించారు. మంగళవారం ప్రజాశక్తి ఏలూరు, నూజివీడు డివిజన్ల 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తూ సమస్యల పరిష్కారానికి 'ప్రజాశక్తి' కృషి చేయాలన్నారు. వాస్తవాలు క్షుణ్ణంగా పరిశీలించి పత్రికలో ప్రచురిస్తే ప్రజాదరణ ఉంటుందని, అప్పుడే పత్రికల జనాల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో ప్రజాశక్తి తనదైన పాత్ర పోషించాలని కోరారు. ప్రజా సమస్యలను ప్రచురించడంలో 'ప్రజాశక్తి'కి ప్రత్యేకత ఉందని, భవిష్యత్తులో అదే ఒరవడి కొనసాగించాలని సూచించారు. సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు 'ప్రజాశక్తి' వెలుగులోకి తీసుకొస్తే అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్, డెస్క్ ఇన్‌ఛార్జి విఎస్ఎస్‌వి.ప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.గంగరాజు, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి పి.నారాయణరాజు, సిబ్బంది వై.సీతారాం, ఎం.సాంబమూర్తి, టి.సత్యవతి, విలేకరులు వి.శ్యాంబాబు, యు.శ్రీనివాస్, డి.నాని పాల్గొన్నారు.

సిపిఎస్‌కు జిపిఎస్ ప్రత్యామ్నాయం కాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎస్‌కు జిపిఎస్ ప్రత్యామ్నాయం కాదని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి విమర్శించారు. ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయ రామరాజా అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి హాజరై మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చేస్తూ వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తానని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు చేయలేక పోగా సిపిఎస్ స్థానంలో జిపిఎస్ గ్యారంటీ పెన్షన్ స్కీం) అమలు చేస్తామని చెప్పడం ప్రభుత్వం ఉద్యోగ ఉపా ధ్యాయులను మోసం చేయడమేనని తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సిపిఎస్ అమల్లోకి వచ్చిన రోజైన సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా ప్రతి సంవత్సరమూ పాటించి పోరాటం చేస్తామన్నారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే వైనాట్ ఒపిఎస్ పేరుతో జరిగే పోరాటానికి ఫ్యాపో సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం మాట్లాడారు. పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఎం.మార్కండేయులు, కె.రాజశేఖర్, నాని, రామయ్య, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - కాళ్ల

జువ్వలపాలెం గ్రామంలో పలు ప్రాంతాల్లో మూడు సిమెంటు రోడ్ల నిర్మాణానికి డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు మంగళవారం శంకుస్థాపన చేశారు. కాళ్ల మండల ప్రజా పరిషత్ సహాయ నిధులు రూ.6 లక్షలు, జిల్లా పరిషత్, 15 ఫైనాన్స్ సహాయ నిధులు రూ.5 లక్షల రూపాయలు, ఎన్ఆర్ఇజిఎస్ సహాయ నిధులు రూ.10 లక్షలతో మూడు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మీసాల రమణ, ఎంపిటిసి మీసాల శ్రీనివాస్, ఉప సర్పంచి కఠారి లక్ష్మీపతిరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ, సమయపాలన పాటించాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అన్నారు. మంగళవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో నెలవారీ సెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కేంద్రాన్నీ ఏదో సమయంలో అధికారులు తనిఖీ చేసే అవకాశం ఉందన్నారు. లబ్ధిదారులకు సమయానికి పోషకాహారం అందించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, ఎం.వెంకటలక్ష్మి, నాగమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్‌కు ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక పాతూరులోని 12వ వార్డు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు మాజీ శాసనసభ్యులు ఈలి నాని పుట్టినరోజు సందర్భంగా పాతూరి యూత్ సభ్యులు దాట్ల జగన్నాధరాజు, శ్రీరంగం రామాంజనేయులు సౌజన్యంతో రెండు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. ఈ సందర్భంగా దాతలకు ప్రధానోపాధ్యాయులు కనకదుర్గ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాట్ల జగన్నాధరాజు, శ్రీరంగం రామాంజనేయులు, నీలం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం టిడిపిని గెలిపించాలి

ప్రజాశక్తి - కాళ్ల

భావితరాల భవిష్యత్ కోసం టిడిపిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు అన్నారు. కోపల్లెలో టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని తరగతుల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో పెంచిన పన్నులు కట్టలేక పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. మినీ మేనిఫెస్టో అంశాలను మహాశక్తి కార్యక్రమం ద్వారా మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బూడి నాగమణి, ఉప సర్పంచి బూడి వెంకట పత్రాలు, క్లస్టర్ ఇన్‌ఛార్జి తోట ఫణిబాబు, మహాశక్తి టీము సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆక్వా రైతులు సామూహికంగా పోరాడితే సమస్యలను పరిష్కరించుకోవచ్చని జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు. మంగళవారం స్థానిక ఆక్వారైతు తేతలి సుధీర్‌రెడ్డి నివాసంలో సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ ప్రస్తుతం వరి తక్కువగా ఉన్న నేపథ్యంలో ఏప్రిల్, మే నెలల్లో క్రాఫ్ హాలీడే అందరితో కలిసి ప్రకటిస్తామని చెప్పారు. రైతుల దగ్గరకు వచ్చే టెక్నిషియన్స్ ఆక్వా సాగు పెంచేందుకు ఇచ్చిన సలహాలో ధర గురించి రైతులకు ఎందుకు చెప్పే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ సంఘంగా కలిసి పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బోణం చినబాబు, ట్రెజరర్ దాట్ల సోమ్‌బాబు, రైతులు సోమరాజు, గాదిరాజు సాయి రామరాజు, భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, ముదునూరి నాగరాజు పాల్గొన్నారు.

ఇసుక పేరుతో దోపిడీ

దొంగరావిపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

ఇసుక పేరుతో ప్రభుత్వం దోపిడీ చేస్తోందని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం దొంగరావిపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నిమ్మల మాట్లాడారు. ఇసుక పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు దోపిడీ చేస్తోందన్నారు. అధిక ధరలకు విక్రయిస్తూ రాష్ట్ర ప్రజలను దోచుకుంటోందని విమర్శించారు. ఎక్కడ చూసినా వైసిపి ఇసుక బకాసురులు కోట్ల రూపాయలు ఇసుకను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. అనంతరం తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, నియోజవర్గ ఇన్‌ఛార్జులు, టిడిపి శ్రేణులు మాట్లాడారు.

భీమవరంలో ఆహా క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శుచి, రుచికరమైన ఆహారాన్ని ఇంటి వద్దే వండి తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆహా క్యాంటీన్లను పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మావుళ్లమ్మ గుడి పక్కన మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌ను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, మెప్మా అధికారులు నానిబాబు, శాంతికుమారి, జె.కృష్ణ, కృపామణి పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

నిట్ డీన్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎపి నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్ సూచించారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో సంస్థలోని పరిపాలనా భవనం వద్ద జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలతో చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డీన్ అకడమిక్ డాక్టర్ టి.కురుమయ్య మాట్లాడుతూ ఒలింపిక్స్ క్రీడల్లో భారతదేశానికి వరసగా మూడు బంగారు పతకాలను అందించిన హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యానచంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. విద్యార్థులు జాతీయస్థాయి క్రీడాపోటీల్లో రాణించి సంస్థకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం పరిపాలనా భవనం నుంచి మెయిన్ గేట్ మీదుగా తిరిగి పరిపాలనా భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత ధ్యానచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో వీరేష్ కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సాస్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకూ ప్రచారం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పివిఎల్ రాష్ట్ర అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యతిస్తోందన్నారు. ప్రజల వద్దకు పాలన అందించేందుకు సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, వైసిపి నాయకులు జవ్వాది సత్యనారాయణ, గ్రామ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఇళ్ల హరి రామకృష్ణ పాల్గొన్నారు.



లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం వేగవంతంగా జరుగుతోందని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన స్లాబ్ పనులను ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. మొదటి విడతగా 50 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని రూ.10 కోట్ల 15 లక్షల నిధులతో ప్రారంభించామని, మరో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సుమారుగా రూ.30 కోట్ల నిధుల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నాబార్డుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అతి త్వరలోనే ఈ నిధులు మంజూరవుతాయని తెలిపారు. ఆసుపత్రికి వెళ్లడానికి 40 అడుగుల రోడ్డు కూడా నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎండిసి డిఇ శ్రీనివాస్ రెడ్డి, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్‌పిటిసి కాండ్రేగుల నరసింహారావు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరసనల్లో పాల్గొనాలి: సిపిఎం

ప్రజాశక్తి - తణుకు రూరల్

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరుద్యోగం, అధిక ధరలపై సిపిఎం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో పార్టీ సభ్యుల సమావేశం కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. అనంతరం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లలో మోడీ ప్రభుత్వం పేదలను కొట్టి, పెద్దలకు దోచి పెట్టడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ధరలు చంద్రయాన్ అంత ఎత్తుకు వెళ్లాయన్నారు. బియ్యం, నిత్యావసరాలపై కూడా జిఎస్‌టి వేయడం సిగ్గు చేటన్నారు. తక్షణం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, అజయకుమారి, పిఎల్ నర్సింహారావు, పిడి.మూర్తి, ముత్యాల రావు, రాజశేఖర్, వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : కేంద్రంలో మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ తాడేపల్లిగూడెంలో నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పట్టణ పార్టీ సభ్యుల కార్యక్రమం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో పుట్టా వేణుగోపాల చౌదరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తున్నారన్నారు. పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. ఈ భారాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్య పరిష్కరించాలన్నారు. దశలవారీ నిరసనలు, ఆందోళనల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరెడ్ల రామకృష్ణ, శ్రీను, రాజు పాల్గొన్నారు.

పెంటపాడు : స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిపిఎం సమరభేరి వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపువరపు రంగారావు, కర్రి సాయిరెడ్డి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో అధికార పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను మర్చిపోయి పాలన సాగిస్తున్నాయన్నారు. యువతీ యువకులకు ఉద్యోగావకాశాల్లేక కూలి పనులకు వెళ్తున్నారని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వాలు పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తి కోదండరామిరెడ్డి, కొవ్వూరు రామిరెడ్డి, గుండ్రెడ్డి సాయి, కొవ్వూరు పల్లారెడ్డి, సత్తి శ్రీనివాస్ రెడ్డి, గోవింద్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా క్రీడ, భాషా దినోత్సవం



పాలకొల్లు : తెలుగు పండితులను సత్కరిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని జివిఎస్‌వి ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో యునైటెడ్ కాపు సర్వీస్ ఇంటర్నేషనల్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ క్రీడ, భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యమునా విజయలక్ష్మి మాట్లాడుతూ భారత గొప్ప హాకీ ఆటగాడు ధ్యాన్ చంద్ జయంతిని క్రీడా దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఆయన ఆధ్వర్యంలో భారత్ ఒలింపిక్స్ హాకీలో 6 బంగారు పతకాలు గెలుచుకుందని చెప్పారు. అనంతరం వ్యాసరచన, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండెల లక్ష్మీ భార్గవి, కర్రే రేవతి, కుంపట్ల రీతు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర : మల్లిపూడిలోని చాణక్య ఇంగ్లీష్ మీడియం అప్పర్ ప్రయిమరీ స్కూల్లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాష గొప్పతనం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు అక్షర క్రమంలో కూర్చొని తెలుగు భాషపై తమ అభిమానం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లు : భాష ఉంటేనే సంస్కృతీ సంప్రదాయాలు నిలుస్తాయని రిటైర్ తెలుగు పండితులు వికె.సత్యనారాయణ చెప్పారు. పాలకొల్లు ఛాంబర్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అమెరికాలో తెలుగువారు మనకన్నా సంస్కృతీ సంప్రదాయాలను బాగా ఆచరిస్తున్నారన్నారు. సెక్రటరీ కలిదిండి రామరాజు, ఇనుకొండ రంగారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవలను తెలుగు ప్రజలంతా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

తణుకురూరల్: క్రీడలు ఆరోగ్యానికి, మంచి ఉద్యోగాలు రావడానికి ప్రోత్సాహకరంగా ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నందగోకుల్ నెయ్యి మానేపల్లి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్, సెక్రటరీ కరస్పాండెంట్ మాంటిస్సోరి స్కూల్ ఉల్లంపర్రు మద్దాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం భారత జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్‌సిఐఎం ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో 2కె రన్ నిర్వహించారు. అనంతరం క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం గెలుపొందిన విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సిహెచ్.సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఎన్‌వివి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణ, వ్యాయమ ఉపాధ్యాయులు ఎన్ఆర్.అప్పారావు, కె.సుబ్బారావు, బి.సుబ్రహ్మణ్యం, కె.శ్రీనివాస్, ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఆదిత్య డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి.కొత్తపల్లి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.లీలాకుమార్ విచ్చేసి తెలుగు జాతి, తెలుగు భాష, గ్రంథాలు వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఇతిహాస కథలు, శతక పద్యాలు ,వ్యాసరచన, కవుల రచయితల చార్ట్ ప్రదర్శన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

భీమవరం రూరల్: స్థానిక ఆదిత్య స్కూల్‌లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించామని స్కూల్ డైరెక్టర్ లయన్ ఆదిత్య కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ భాషను మర్చిపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, బి.యుగసుధ, కె.సత్యన్నారాయణ, దుర్గాంబ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం వద్ద కెజెఎస్ఎల్.కుమారి గ్రేడ్ వన్ లైబ్రరియన్ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రీడర్స్ ఫోరం అధ్యక్షులు సుధీర్ మోహన్ పాల్గొని మాట్లాడారు. అనంతరం గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు జీవన్ కుమార్, సూర్యంబాబు, శ్యాంబాబు, శ్రీనివాస్, వెంకటేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

గొరగనమూడి పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఉత్తమ క్రీడా ప్రతిభ కనబర్చిన ఐదు పాఠశాలలకు క్రీడా ప్రతిభ (స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్) అవార్డు అందించింది. దీనిలో భాగంగా జిల్లా నుంచి గొరగనమూడి స్వామి జ్ఞానానంద ఉన్నత పాఠశాలకు ప్రథమ స్థానం సాధించి బెస్ట్ స్కూల్ ప్రతిభ అవార్డు దక్కింది. భీమవరం కలెక్టరేట్లో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయిని ఎన్.విజయలక్ష్మికి మంగళవారం అవార్డు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది స్కూల్ గేమ్స్‌లో క్రీడాకారులు జోనల్, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా జిల్లాలో తొలి 5 స్థానాలు పాయింట్స్ ఆధారంగా ప్రకటించి ఈ అవార్డులు అందజేశారు. గొరగనమూడి స్వామి జ్ఞానానంద హైస్కూల్‌కు ప్రథమ స్థానం లభించగా, భీమవరం ఎస్‌సిహెచ్‌బిఆర్‌ఎం ఉన్నత పాఠశాలకు ద్వితీయ స్థానం, వీరవాసరం మండలం తోలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తృతీయ స్థానం, మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాలుగో స్థానం, అత్తిలి ఎస్‌విఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఐదో స్థానం లభించింది. ఈ అవార్డులను డిఇఒ వెంకటరమణ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వ్యాయామ ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎండి ఖుద్దూస్, అధ్యక్షులు కృష్ణారెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి బి.జాన్సన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల హెచ్‌ఎం, పిఇటికి అవార్డు అందజేస్తున్న డిఇఒ రమణ

అభినందన సభ

జిల్లాలో గొరగమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం సాధించి ప్రతిభ అవార్డు రావడం పట్ల స్థానిక పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీదేవి, వ్యాయామ ఉపాధ్యాయిని విజయలక్ష్మి గ్రామ సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు), పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పొన్నమండ బాలకృష్ణ, స్వామి జ్ఞానానంద ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

చేపల కోసం వెళ్లి..

ప్రజాశక్తి - ఉండి

చేపలు పట్టడం కోసం మురికి కాలువలో దిగిన వ్యక్తి మృతి చెందిన సంఘటన పాందువ్వ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అస్సాం రాష్ట్రం డీమోజీ జిల్లాలోని మైదాపూర్ ప్రాంతానికి చెందిన అమరాజ్ బాస్మతి అనే వ్యక్తి 4 నెలల క్రితం పాందువ్వ గ్రామంలోని రుద్రరాజు శ్రీహరి రాజు చెరువు వద్ద నెల జీతానికి పనికి చేరాడు. అతని తమ్ముడు బామున్ బాస్మతి (15) సోదరుని చూడటానికి రెండు నెలల క్రితం గ్రామానికి వచ్చి అతనితో ఉండిపోయాడు. రోజులాగే గ్రామ శివారులో ఉన్న మురికి కాలువలో దిగి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు సోమవారం మధ్యాహ్నం మునిగిపోయాడని, మంగళవారం రాజు మృతదేహం తేలిందని తెలిపారు. అమరాజ్ బాస్మతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.గంగాధర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికపై అత్యాచారం

ఆకివీడు: చెరుకుమిల్లి శివారు కమతవానిగూడెం గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన యువకుడు కమతం సత్యం (సత్తి) అత్యాచారానికి పాల్పడినట్లు ఆకివీడు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన ఈనెల 25వ తేదీన చోటు చేసుకుంది. ఈ మేరకు బాలిక మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొగల్తూరులో కేంద్ర బృందం పర్యటన

మొగల్తూరు: మొగల్తూరులోని ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు పరిశీలించారు. మంగళవారం ఢిల్లీలోని సెంట్రల్ సెక్రటేరియట్‌కు చెందిన ఏడుగురు బృందం క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని సత్రావపాలెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని, సచివాలయాన్ని సందర్శించి వాటి ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. వారికి ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్ ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ యువ అధికారులు హేమంత్ మీనా, నిషిత్ ఇండోరా, బసు దేవ్ యాదవ్, మయాన్ అగర్వాల్, విశాల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో సొసైటీ కార్యదర్శి సాయికిషోర్ మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సోమరాజు ఇల్లింద్రపర్రు సహకార సంఘం కార్యదర్శి పొదిల సాయి కిషోర్ (52) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఇంటి వద్ద గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం ఏలూరు తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన మృతికి తోటి ఉద్యోగులు సంతాపం తెలిపారు.

వరికి ఆకునల్లి తెగులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరిలో అడపాదడపా ఆకునల్లి తెగులు కనిపిస్తోందని మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఎడిఆర్ డాక్టర్ ఎం.భరతలక్ష్మి అన్నారు. మంగళవారం సంస్థలో ఉభయగోదావరి జిల్లాల శాస్త్రవేత్తలు, ఎఒలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా భరతలక్ష్మి మాట్లాడుతూ పంటలో ఎండాకు తెగులు, ఆకునల్లి తెగులు గురించి వివరించారు. వరిలో పొటాష్ వాడకం పెంచాలన్నారు. 1318 రకం సాగులో నత్రజని వాడకం తగ్గించాలని రైతులకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పి.మురళీకృష్ణ, వరి ప్రధాన శాస్త్రవేత్త టి.శ్రీనివాస్, నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి టి.అనిల్‌కాంత్ పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి జాతర

కాళ్ల: అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఆకాంక్షించారు. జువ్వలపాలెం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి 77వ వార్షిక జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. తీన్మార్, విచిత్ర వేష ధారణలతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, గోకరాజు రామరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంఎల్‌ఎ మంతెన రామరాజును, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్‌ను, గోకరాజు రామరాజును ఘనంగా సత్కరించారు.

టిడిపి నేత ఏడుకొండలు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో టిడిపి సీనియర్ నాయకుడు తోట వెంకటేశ్వరరావు (ఏడుకొండలు) మృతి చెందారు. ఆయన కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. మంగళవారం సాయంత్రం మృతి చెందారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

గోస్తనీ కాలువ ఒడ్డున ఉన్న శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి వి.గంగాధరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ శ్మశానవాటిక పిచ్చి మొక్కలు, చెత్తా చెదారంతో అస్తవ్యస్తంగా ఉందన్నారు. వర్షాకాలంలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు గోస్తనీ కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నప్పుడు శ్మశానవాటికి ముంపునకు గురవుతోందన్నారు. విద్యుత్ లైట్లు ఒకటికి మించి ఎక్కువ లేకపోవడం వల్ల చీకటిగా ఉంటోందని తెలిపారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, విద్యుత్ లైట్లు, డ్రెయినేజీ, రోడ్లు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, కె.మల్లికార్జునరావు, విశ్వనాథం సుబ్బారావు, కె.రాంబాబు, అంజి పాల్గొన్నారు.